## ఉచిత కరాటే శిక్షణ అభినందనీయం

### బెటాలియన్ కమాండెంట్ వెంకట్రాములు



కరాటేలో ప్రతిభ చాటిన విద్యార్థులు

సత్తుపల్లి టౌన్, మే 31: సత్తుపల్లి లైన్ బుడోఖాన్ కరాటే హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో వేసవిలో ఉచిత కరాటే శిక్షణ ఇవ్వడం అభినందనీయమని గంగారం 15వ బెటాలియన్ కామాండెండ్ వెంకట్రాములు అన్నారు. సత్తుపల్లి లైన్ బుడోఖాన్ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు జరిగిన ఉచిత కరాటే శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల కోసం వేసవిలో అనేక సంవత్సరాలుగా శిక్షణ ఇస్తున్న కరాటే మాస్టర్ పిచ్చయ్యను అభినందించారు. ఇక్కడ శిక్షణ పొందిన విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించడం అభినందనీయమన్నారు. అనంతరం శిక్షణ పొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన బాధ్యులు వెంకట్రావు, విశ్వశాంతి విద్యాలయం ప్రిన్సిపాల్ పసుపులేటి నాగేశ్వరరావు, కమాండెండ్ వెంకట్రాములు, కరాటే మాస్టర్ పిచ్చయ్య, విశ్రాంత ఉపాధ్యాయులు సలీం, నవచైతన్య, ఫైనాట్స్ ఆకాడమి, సృజన, లైవ్ సంస్థల నిర్వాహకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నాయకుల నివాళి



నివాళులు అర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఎర్రుపాలెం, మే 31: మండలంలోని పెగళ్లపాడు గ్రామానికి చెందిన సగ్గుర్తి సుదర్శనం శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన భౌతికకాయాన్ని బీఆర్ఎస్ నాయకులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పంబి సాంబశివరావు, గ్రామశాఖ అధ్యక్షుడు సగ్గుర్తి వెంకటరత్నం, ఎంపీటీసీ సగ్గుర్తి కిషోర్‌బాబు, మహిళా మండల సభ్యురాలు పులి శిరీష, పులి నాగయ్య, సగ్గుర్తి శ్రీను, సగ్గుర్తి బాలకృష్ణ ఉన్నారు.

## అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ మధు

ఎర్రుపాలెం, మే 31: మండల కేంద్రంలో శుక్రవారం అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతిచెందిన ఘటన చోటు చేసుకున్నది. సీఐ డీ.మధు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. ఎర్రుపాలెం నుంచి రేమిడిచర్ల వెళ్లే రహదారిలో వైన్‌షాపు సమీపంలో పొలంలోని ఓ చెట్టు కింద వ్యక్తి మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఘటనాస్థలానికి పోలీసులు వెళ్లి చూడగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లా జయంతి గ్రామానికి చెందిన పడిగల శ్రీనివాసరావు(55) అనే వ్యక్తి మృతిచెంది ఉన్నాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారని, కుమారుడు పడిగల ఆంజనేయులు తన తండ్రి మృతిపై జయంతి గ్రామానికి చెందిన భీమిరెడ్డి నరేందర్‌రెడ్డి, గుణ్ణం వెంకటరెడ్డిలపై అనుమానం ఉన్నదని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



కూసుమంచి: మల్లేపల్లిలో మాట్లాడుతున్న ఏవో వాణి



విత్తన దుకాణాల్లో తనిఖీ చేస్తున్న వ్యవసాయ, పోలీసు అధికారులు

కూసుమంచి, మే 31 : విత్తన దుకాణదారులు, ఇతరులు ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏవో ఆర్.వాణి తెలిపారు. మండలంలోని మల్లేపల్లిలో శుక్రవారం వానకాలం పంటలు, విత్తనాల కొనుగోళ్లు వంటి వాటిపై రైతులకు ఆమె అవగాహన కల్పించారు. రైతులు పంటలకు తగిన ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. రసాయాన మందుల వాడకాలు తగ్గించాలన్నారు. ఎక్కువగా సేంద్రియ ఎరువులు వాడాలని కోరారు. కార్యక్రమంలో రైతులు ఏఈవో వంశీ తదితరులు పాల్గొన్నారు.

**విత్తన దుకాణాల తనిఖీ**

బోనకల్లు, మే 31: రైతులకు పంటలు సాగు చేసుకునేందుకు విత్తన డీలర్లు నిల్వ ఉంచిన విత్తనాలను వ్యవసాయ, పోలీసు అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా షాపుల్లోని రికార్డుల్లో స్టాక్ వివరాలు, వివిధ రకాల పత్తి విత్తన ప్యాకెట్లను పరిశీలించారు. అనంతరం ఏవో సరిత మాట్లాడుతూ.. రైతులకు కావాల్సిన విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కొంత మంది నకిలీ విత్తనాలను విక్రయించే పరిస్థితి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్సై మధుసూదన్, వ్యవసాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## 'కిరాణ షాపులో అంగన్‌వాడీ గుడ్లు'పై విచారణ

**'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన**



విచారణ నిర్వహిస్తున్న సీడీపీవో కవిత, సూపర్‌వైజర్లు

రఘునాథపాలెం, మే 31: ఖమ్మం అర్బన్ పాండురంగాపురంలో అంగన్‌వాడీ సరుకులు పక్కదారిన పడుతున్న వైనంపై 'నమస్తే తెలంగాణ' పత్రిక శుక్రవారం 'కిరాణం షాపుల్లో అంగన్‌వాడీ గుడ్లు' పేరుతో ఓ కథనాన్ని ప్రచురించింది. దీనిపై ఆ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు, కలెక్టర్, పీడీ కలిసి సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. వారి ఆదేశాల మేరకు ఖమ్మం అర్బన్ ఐసీడీఎస్ అధికారులు అంగన్‌వాడీ గుడ్లు విక్రయించిన కిరాణం షాపులో శుక్రవారం విచారణ నిర్వహించారు. ఖమ్మం అర్బన్ సీడీపీవో కవిత, బల్లేపల్లి సెక్టార్ సూపర్‌వైజర్ చెరుకూరి నాగమణిలు కిరాణం షాపు వద్దకు చేరుకొని విచారణ చేశారు. షాపులో గుడ్లు విక్రయించిన విషయం వాస్తవమేనని గుర్తించారు. షాపు నిర్వాహకుడు నరహరి శ్రీనివాసరావు కుమార్తె లబ్ధిదారురాలిగా అంగన్‌వాడీ కేంద్రం నుంచి ఇటీవల గుడ్లు పొందిందని, ఈ విషయం తెలియక ఆమె తండ్రి.. తన కిరాణం షాపులోని గుడ్లు అయిపోవడంతో ఇంట్లో ఉన్న అంగన్‌వాడీ గుడ్లను తెచ్చి విక్రయించాడని తేల్చారు. కిరాణం షాపు, ఇల్లు ఒక్కటే కావడంతో తప్పిదం జరిగినట్లుగా షాపు నిర్వాహకులు అధికారులకు సమాధానం ఇచ్చారు. అయితే సదరు ఏరియా అంగన్‌వాడీ టీచర్ సెలవులో ఉండగా.. లబ్ధిదారురాలికి ఆయా ఈ గుడ్లను సరఫరా చేసినట్లు తెలిసింది. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు సమాచారం.

## ఎస్‌బీఐటీ విద్యార్థికి 'సర్వీస్ నౌ' సర్టిఫికెట్లు



విద్యార్థి ప్రభును అభినందిస్తున్న ఎస్‌బీఐటీ చైర్మన్ కృష్ణ

ఖమ్మం ఎడ్యుకేషన్, మే 31: ఖమ్మం ఎస్‌బీఐటీ కళాశాలకు చెందిన ఫోర్త్ ఇయర్ విద్యార్థి ఎంవీ ప్రభు ప్రముఖ అంతర్జాతీయ సాఫ్ట్‌వేర్ సంస్థ సర్వీస్ నౌ నిర్వహించిన ప్రతిభా పరీక్షలో అద్భుత ప్రదర్శన కనబరిచాడని, ఆ సంస్థకు చెందిన రెండు సర్టిఫికెట్లను కైవసం చేసుకున్నాడని కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. ఈ మేరకు ప్రతిభ చాటిన విద్యార్థి ప్రభును శుక్రవారం ఆయన తమ కళాశాలలో అభినందించారు. ఈ సర్టిఫికెట్ల ద్వారా రూ.16 లక్షల నుంచి రూ.48 లక్షల వరకూ వార్షిక ఆదాయం అందుకునే అవకాశాన్ని తమ విద్యార్థి పొందినందుకు తమకు గర్వకారణంగా ఉందని అన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ ధాత్రి, కళాశాల బాధ్యులు రాజ్‌కుమార్, షేక్ గౌస్‌పాషా, అమిత్, గంధం శ్రీనివాసరావు, శివప్రసాద్, ప్రవీణ్‌కుమార్, రవీంద్రబాబు, శ్రీనివాసరావు, సవిత, ప్రభాకర్ తదితరులు కూడా విద్యార్థి ప్రభును అభినందించారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మధిర, మే 31: ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అపరిశుభ్రతగా ఉంటే అంటువ్యాధులు వస్తాయని మున్సిపల్ కమిషనర్ షఫీఉల్లా అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని పలువార్డులను ఆయన పరిశీలించారు. వార్డు కౌన్సిలర్లు పరిశుభ్రతపై ఫిర్యాదు చేయడంతో స్పందించిన కమిషనర్ కార్మికుల ద్వారా చెత్తను ఎత్తించి డంపింగ్‌యార్డుకు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చెత్తాచెదారాన్ని రోడ్లపై వేయకుండా మున్సిపాలిటీ ఏర్పాటు చేసిన చెత్త హుండీల్లో వేయాలని సూచించారు.

## నేడు మండలంలో మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మం రూరల్, మే 31 : రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మండలంలో పర్యటిస్తారని మంత్రి క్యాంపు కార్యాలయం ఇన్‌చార్జ్ తుంబూరి దయాకర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో భాగంగా పలు గ్రామాల్లో ఆయన పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగితెలుసుకోవడం జరుగుతుందన్నారు.

## సబ్సిడీపై జీలుగు పంపిణీ



రైతులకు జీలుగు విత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయాధికారులు

వేంసూరు, మే 31: మండలంలోని కేజీ మల్లెల సొసైటీలో వ్యవసాయాధికారులు రైతులకు సబ్సిడీపై జీలుగు విత్తనాలను శుక్రవారం పంపిణీ చేశారు. మండల వ్యవసాయాధికారి రామ్మోహన్‌రావు మాట్లాడుతూ.. సొసైటీ పరిధిలో 500 క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉంచామని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవోలు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ



సంతకాల సేకరణ ప్రారంభిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పెనుబల్లి, మే 31: భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) మండల కమిటీ ఆధ్వర్యంలో వీఎం.బంజర జిల్లా కమిటీ సభ్యులు కొర్ర తిరుమల్ అధ్యక్షతన రాష్ట్రంలో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బెజవాడ సాయిశేషు మాట్లాడుతూ.. జిల్లాలో ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలలపై విద్యాశాఖ అధికారి పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టానుసారంగా అధిక ఫీజుల వసూలు చేస్తూ లాభార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. అనంతరం సంతకాల సేకరణ కార్యక్రమాన్ని యూటీఎఫ్ జిల్లా నాయకులు రామారావు, మౌంటెనర్ మోతికుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో అన్నపురెడ్డి శ్రీనివాస్, బజ్జురి వంశీ, బాబురావు, చెక్కిల వంశీ, గాయం తిరుపతిరావు, స్వామి, తరుణ్, హరి పాల్గొన్నారు.

## ఎండ తీవ్రతపై జాగ్రత్తలు పాటించాలి

సత్తుపల్లి, మే 31: ఎండ తీవ్రత తీవ్రంగా ఉన్నందున ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ అన్నారు. ఎండలు అధికంగా ఉన్నందున బయటకు వెళ్లేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని, అత్యవసరం అయితే తప్ప బయటకు రావొద్దన్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పనులు పూర్తి చేసుకోవాలని పేర్కొన్నారు. పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు, రోజుకు కనీసం 4 లీటర్ల మంచినీళ్లు తీసుకోవాలన్నారు. అవసరమైతే తప్ప బయటకు రావొద్దని, జాగ్రత్తలు పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు.

## స్నేహితుని కుటుంబానికి ఆర్థిక చేయూత



ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

వైరాటౌన్, మే 31: వైరా పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1996–98లో ఇంటర్ చదువుకున్న విద్యార్థులు తోటి మిత్రుడికి ఆర్థిక చేయూత అందించారు. వైరాకు చెందిన వాంకుడోతు శ్రీనివాస్ సతీమణి అనారోగ్యం కారణంగా ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాడు. విషయం తెలుసుకున్న తోటి ఇంటర్ మిత్రులు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో మిత్రులు శ్రీనివాసరావు, కొండలరావు, అఫ్జల్, కృష్ణయ్య, శేషగిరి, రఫి, సీతారాములు, వెంకట్ పాల్గొన్నారు.

## పొగాకు వ్యతిరేక దినోత్సవ వేడుకలు

తిరుమలాయపాలెం, మే 31: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో శుక్రవారం పొగాకు వ్యతిరేక దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు మాట్లాడుతూ.. పొగాకు తాగడం వలన వచ్చే ఆరోగ్య సమస్యలను వివరించారు. కార్యక్రమంలో వైద్యులు రామారావు, కృపాఉషశ్రీ, శ్రీనివాసరావు, ప్రదీప్‌రెడ్డి, నాగేశ్వరావు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల అందజేత



ల్యాప్‌టాప్ అందజేస్తున్న దృశ్యం

వైరాటౌన్, మే 31: పేద విద్యార్థులకు రాయితీపై ల్యాప్‌టాప్ అందించడం ద్వారా వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేసినట్లు అవుతుందని ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ అన్నారు. లయన్స్‌క్లబ్ వైరా అధ్యక్షుడు పెనుగొండ ఉపేందర్‌రావు అధ్యక్షతన స్థానిక మురళీకృష్ణ హాస్పిటల్ నందు డాక్టర్ కాపా చంద్రకళ పుట్టినరోజు సందర్భంగా బీటెక్ థర్డ్ ఇయర్ చదువుతున్న కోమట్లగూడానికి చెందిన లక్కిరెడ్డి అనూషకు రాయితీపై ల్యాప్‌టాప్ అందించారు. క్లబ్ అధ్యక్షుడు పెనుగొండ ఉపేంద్రరావు, యు.శ్యామ్‌బాబు, లగడపాటి ప్రభాకర్, అబ్బూరి రమేష్, చింతలపూడి వెంకటేశ్వరరావు, రాయపూడి వెంకటేష్, మరికంటి రాంగోపాల్, చెరుకూరి శ్రీనివాసరావు, చారుగుండ్ల అక్షిత్, కరుణాకర్ పాల్గొన్నారు.

### ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **మధిర బ్రాంచ్** వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **మూల్పూరి స్వప్న**, W/o : **శ్రీనివాసరావు, వయస్సు** : 28 సం||లు, **వృత్తి** : గృహిణి, **నివాసం** : జమలాపురం గ్రామం, ఎర్రుపాలెం మండలం, ఖమ్మం జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లెయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి **5** రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు. **షెడ్యూలు ఆస్తి** : ఖమ్మం జిల్లా రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్ మధిర సబ్ రిజిస్ట్రార్ వారి పరిధిలోని ఖమ్మం జిల్లా పరిషత్ ఎర్రుపాలెం మండల పరిషత్ జమలాపురం గ్రామ పంచాయితీ ఏరియాలోని జమలాపురం రెవిన్యూ రికార్డుకు చెందిన సర్వే నెంబర్ 9/1 య.0.13 కుంటల మింజుమలె య.0.15 సెంట్లు అనగా చ||గ|| 726 (చ.మీ. 607.003) గల స్థిరాస్తి ఖాళీ స్థలము ఇ.నెం. 4–126నకు సమీపమున కలదు. **డాక్యుమెంట్ నెం.3103/2009** గల ఆస్తికి హద్దులు : **తూర్పు**: ప్రాధమిక పాఠశాల స్థలం, భవనము, **దక్షిణము** : ప్రాధమిక ఆరోగ్య కేంద్రం స్థలం, భవనము, **పడమర** : రోడ్డు, **ఉత్తరం** : సర్వే నెంబర్ 8 స్థలము.

**జి.హరేందర్ రెడ్డి**
అడ్వకేట్, ఖమ్మం. సెల్ : 9848022542

## ఎమ్మెల్సీ తాతా మధు జన్మదిన వేడుకలు



ఖమ్మం నగరంలో.. కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఖమ్మం/ కొణిజర్ల/ కారేపల్లి/ తిరుమలాయపాలెం, మే 31: ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ మండలల్లో శుక్రవారం నిర్వహించారు. ఈ మేరకు ఆయా చోట్ల కేక్ కట్ చేశారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు. ఖమ్మంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయమైన తెలంగాణ భవన్‌లో జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అన్నివేళలా అందుబాటులో ఉంటూ అండగా నిలిచే పార్టీ జిల్లా అధ్యక్షుడు తాతా మధు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. నాయకులు, ఉద్యమకారులు పగడాల నాగరాజు, ఉప్పల వెంకటరమణ, తాజుద్దీన్, శీలంశెట్టి వీరభద్రం తదితరులు పాల్గొన్నారు. అలాగే, కొణిజర్ల మండలం తీగలబంజరలో బీఆర్ఎస్ నాయకుడు లకావత్ గిరిబాబు కేక్ కట్ చేసి సహచర నేతలకు స్వీట్లు తినిపించుకున్నారు. కారేపల్లి బస్టాండ్ సెంటర్‌లో ఎంపీపీ శకుంతల, వైస్ ఎంపీపీ శ్రీనివాసరావు తదితరులు కేక్ కట్ చేశారు. తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలులో తాతా మధు తండ్రి, స్వాతంత్ర్య సమరయోధుడు తాతా కిష్టమయ్య కేక్ కట్ చేశారు. కార్యకర్తలు స్వీట్లు పంచుకున్నారు. పటాకులు పేల్చి సంతోషం వ్యక్తంచేశారు. తాతామకు ఫోన్లో శుభాకాంక్షలు తెలిపారు.

## ఉద్యోగానికే విరమణ..



ఏఆర్ ఎస్ఐని సన్మానిస్తున్న సీపీ సునీల్‌దత్



సీడీపీవోను సన్మానిస్తున్న డీడబ్ల్యూవో

పెనుబల్లి, మే 31: పదవీ విరమణ ఉద్యోగానికే కానీ సేవకు కాదని డీడబ్ల్యూవో రాంగోపాల్‌రెడ్డి అన్నారు. కల్లూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి కృష్ణకుమారి శుక్రవారం పదవీ విరమణ పొందడంతో ఆమెను పూలమాల, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే చిన్నారులు, బాలింతలకు అంగన్‌వాడీ సేవలు పూర్తిస్థాయిలో వినియోగించేలా సీడీపీఎస్ కృష్ణకుమారి ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో చంద్రుగొండ సీడీపీవో జ్యోతి, ఏసీడీపీవోలు మెహరున్నిస్సాబేగం, మహబూబ్అలీ, యూడీసీ శివరామకృష్ణ, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

**ఏఆర్ ఎస్ఐకి సీపీ సన్మానం**

మామిళ్లగూడెం, మే 31: ఉద్యోగ విరమణ పొందిన ఏఆర్ ఎస్ఐ ఎండీ గౌస్‌పాషాను సీపీ సునీల్‌దత్ ఘనంగా సన్మానించారు. ఖమ్మంలోని తన కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో సీపీ మాట్లాడుతూ.. రిటైర్మెంట్ అనేది వృత్తికే కానీ వ్యక్తిత్వానికి కాదని అన్నారు. అలాగే, సుదీర్ఘ కాలంగా బాధ్యతాయుతమైన విధులు నిర్వహించి పోలీస్ శాఖకు ఎనలేని సేవలందించారని కొనియాడారు. ఆర్ఐ కామరాజు, పోలీస్ అసోసియేషన్ బాధ్యులు వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, పంతులు, ఏఆర్ఎస్ఐ సంగయ్య పాల్గొన్నారు.

## 'ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేద్దాం'



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘోత్తమరెడ్డి

ఖమ్మం ఎడ్యుకేషన్, మే 31: నూతన విద్యాసంవత్సరం ప్రారంభం కాబోతున్న తరుణంలో ఉపాధ్యాయులు 'బడిబాట' కార్యక్రమాన్ని విజయవంతం చేసి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని పీఆర్‌టీయూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తమరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు పింగలి శ్రీపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. సంఘం క్రియాశీల కార్యకర్తలకు, బాధ్యులకు ఖమ్మంలో శుక్రవారం నిర్వహించిన ఒక్కరోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బాటబాట కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులంతా ఇంటింటికీ వెళ్లి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే బాధ్యతను తీసుకోవాలని, ఎక్కువమంది పిల్లలను సర్కారు బడులలో చేర్పించాలని సూచించారు. అలాగే, జూన్ రెండో వారంలో ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీల షెడ్యూల్ విడుదల అవుతుందని తెలిపారు. సంఘం బాధ్యులు యలమద్ది వెంకటేశ్వర్లు, శ్రీపాల్‌రెడ్డి, బీరెల్లి కమలాకర్, పూల రవీందర్, రంగారావు, న్యూ విజన్ విద్యాసంస్థల అధినేత సీహెచ్ ప్రసాద్, ఆర్.బ్రహ్మారెడ్డి, కట్టా శేఖర్, సుజాత, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## రైలుకింద పడి వ్యక్తి మృతి

చింతకాని, మే 31: ప్రమాదవశాత్తు రైలు కింద పడి వ్యక్తి మృతిచెందిన ఘటన పందిళ్లపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో 497నంబరు మైలురాయి వద్ద శుక్రవారం ఉదయం చోటు చేసుకున్నది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 38సంవత్సరాలు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి ఖమ్మం వైపు వెళ్లే ఓ రైలు కింద పడి ఉండొచ్చని, మృతుని వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు లభించలేదని రైల్వే ఎస్ఐ పీ భాస్కరరావు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అన్నం ఫౌండేషన్ సిబ్బంది సహకారంతో ఖమ్మంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించామని, మృతుని ఆనవాళ్లు గుర్తించిన వారు 8712658589, 9493218856 ఫోన్‌నంబర్లలో సంప్రదించాలని ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని రైల్వే పోలీసులు తెలిపారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

BUSINESS OFFER

★ ఇన్సూరెన్స్ రంగంలో గొప్ప బిజినెస్ అవకాశం మీరు ఖమ్మం, కొత్తగూడెం వారా ? మీరు నిరుద్యోగులా / గృహిణి / రిటైర్డ్‌ఎంప్లాయ్ / వ్యాపార / రియల్‌ఎస్టేట్ / చిట్ / పోస్టల్ ఏజెంట్స్ / డాక్టర్ / చార్టెడ్ అకౌంటెంట్ / టాక్స్ కన్సల్టెంట్ / బ్యూటీషియన్ ఎవరైనా, ఎటువంటి పెట్టుబడి లేకుండా బిజినెస్ చేయాలని ఆసక్తికలిగి లీడర్ / ఏజెంట్ & పార్టనర్‌గా ఎదగాలని అనుకుంటే ఈ అవకాశం మీ కొరకే. సంప్ర : 7780662996

NTKMM-

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

WANTED

jobs Apply Now!

★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.

NT-327724-AII

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ

నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు

సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు

సెల్ : 9182777616